# సాక్షి

## డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

ఆదివారం | 3 | ఆగస్టు | 2025






**రూ.50,116 విరాళం**

ఆలమూరు: చింతలూరు నూకాంబిక ఆలయ గోపురాల అభివృద్ధికి గ్రామస్తులు ఈదర వెంకట్రావు, అనంతలక్ష్మి దంపతులు రూ.50,116 విరాళం సమర్పించారు.



**మిత్రోత్సాహం..**

స్నేహం.. సృష్టిలో మధురమైంది.. జీవితంలో మరువలేనిది.. ఆత్మీయతను పంచేది.. ఆహ్లాదాన్ని అందించేది.. అక్షరాలకతీతమైన పుస్తకం లాంటిది.. భారమైన హృదయానికి ఓదార్పునిస్తుంది.

8లో

**సముద్రంలోకి 3.28 లక్షల క్యూసెక్కులు**



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం 3,28,230 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. గోదావరి డెల్టాలకు 14,300 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కాటన్ బ్యారేజీ వద్ద 10 అడుగుల నీటిమట్టం ఉంది.

## న్యూస్‌రీల్

### ఇంటర్ విద్యలో సంస్కరణలపై అవగాహన



ఓరియెంటేషన్ ప్రోగ్రామ్‌లో మాట్లాడుతున్న డీఐఈఓ సోమశేఖరరావు

అమలాపురం టౌన్: ఇంటర్ విద్యలో చేపడుతున్న సంస్కరణల్లో భాగంగా జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో ఓరియెంటేషన్ ప్రోగామ్‌లు శనివారం నుంచి మొదలయ్యాయని డీఐఈఓ వనుము సోమశేఖరరావు తెలిపారు. ఇందులో భాగంగా అమలాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శనివారం జరిగిన గణితం ఓరియెంటేషన్ ప్రోగామ్‌లో ఆయన మాట్లాడారు. రాజోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు కె.గణేశ్వరరావు జిల్లాలోని గణిత అధ్యాపకులకు శిక్షణ ఇచ్చారని చెప్పారు. అలాగే వచ్చే డిసెంబర్ వరకూ వృక్ష, జంతు, భౌతిక, రసాయన శాస్త్రాల్లో కూడా వృత్యంతర శిక్షణ తరగతులు ప్రతి నెలలోనూ జరుగుతాయన్నారు. దీనివల్ల అధ్యాపకులు సిలబస్‌లో వస్తున్న మార్పులు, ప్రశ్నపత్రాల మోడల్స్‌పై విద్యార్థులకు వివరించే విధానం మొదలైందని వివరించారు. దీని వల్ల అంశాల వారీగా చర్చించి నాణ్యమైన బోధన పద్ధతులను ఎంపిక చేసుకునేందుకు అవకాశం ఏర్పడుతుందని డీఐఈఓ చెప్పారు.

### పీఎంశ్రీ పాఠశాలలకు పంద్రాగస్టు నిధులు

విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వం

రాయవరం: ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ)లో భాగంగా జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలల్లో స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమాలకు కేంద్రం నుంచి ప్రత్యేకంగా నిధులు మంజూరయ్యాయి. జిల్లాలో మూడు విడతల్లో 28 పాఠశాలలను పీఎంశ్రీ పథకంలో ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ఈ పాఠశాలల్లో పంద్రాగస్టు వేడుకలను నిర్వహించేందుకు ఒక్కో పాఠశాలకు రూ.25 వేల చొప్పున విడుదల చేశారు. దీనికి సంబంధించి సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఫేజ్–1, 2 పీఎంశ్రీ పాఠశాలలకు ఈ నిధులు కేటాయించారు. ఇలా జిల్లాలో 26 పీఎంశ్రీ పాఠశాలలకు రూ.6.50 లక్షల నిధులు విడుదలయ్యాయి. ఈ నిధులతో విద్యార్థుల్లో స్వాతంత్రోద్యమ స్ఫూర్తిని నింపేందుకు పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలి. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ కార్యక్రమాలు జరపాలి.

### రత్నగిరి కిటకిట

సత్యదేవుని దర్శనానికి 30 వేల మంది



తిరుచ్చి వాహనంపై ఊరేగుతున్న సత్యదేవుడు, అమ్మవారు

అన్నవరం: రత్నగిరి శనివారం వేల సంఖ్యలో వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. ఆలయప్రాంగణం, వ్రతమండపాలు, విశ్రాంత మండపాలు భక్తులతో నిండిపోయాయి. స్వామివారి దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట పట్టింది. సుమారు 30 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి వ్రతాలు రెండు వేలు నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షలు ఆదాయం సమకూరింది. ఐదు వేల మంది భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. ఉదయం పది గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా తూర్పు రాజగోపురం వద్దకు తీసుకువచ్చి తిరుచ్చి వాహనంపై ప్రతిష్ఠించి పూజల అనంతరం ప్రాకార సేవ నిర్వహించి స్వామి, అమ్మవార్లను తిరిగి ఆలయానికి చేర్చారు. కాగా, రత్నగిరి ఆలయ ప్రాకారంలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి టేకు రథంపై సత్యదేవుడు, అమ్మవారిని ఊరేగించనున్నారు.

**వేలం ఖరారు**

రత్నగిరికి వచ్చే భక్తుల సెల్‌ఫోన్లు, కెమేరాలు భద్రపరచేందుకు శనివారం నిర్వహించిన టెండర్ కం బహిరంగ వేలంపాట నెలకు రూ.8.11 లక్షలు చొప్పున ఏడాదికి రూ.97.32 లక్షలకు రికార్డు స్థాయిలో ఖరారైంది. సెల్‌ఫోన్ భద్రపర్చడానికి ఇప్పటి వరకు రూ.ఐదు మాత్రమే వసూలు చేయాలనే నిబంధన ఉండగా దానిని రూ.పదికి పెంచడంతో వేలంపాట భారీగా పెరిగింది. రూ.ఐదు వసూలుకు రెండేళ్ల క్రితం వేలంపాట నిర్వహించగా నెలకు రూ.3.31 లక్షలకు ఖరారైంది. కాగా ఆ వసూలు రూ.పది పెంచగా వేలం రెట్టింపు అంటే రూ.6.62 లక్షలు కావాలి. కానీ అంతకంటే ఎక్కువ మరో రూ.1.49 లక్షలు పెరిగింది. ఇలా ఏడాదికి ఖరారైన వేలం రూ.97.32 లక్షలపై 18 శాతం జీఎస్టీ కూడా వసూలు చేస్తారు. అంటే దాదాపు రూ.17.46 లక్షలు జీఎస్టీ చెల్లించాలి. అంటే ఏడాదికి సుమారు రూ.1.15 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది.



ఉప్పలగుప్తం మండలం ఎస్.కొత్తపల్లిలో ఇప్పటికీ మొదలు కాని ఖరీఫ్ సాగు



అమలాపురం మండలం సమనస వద్ద నాట్లు వేస్తున్న కూలీలు

# సాగు కనబడనాట్లు

- జిల్లాలో మందకొడిగా ఖరీఫ్
- 1.63 లక్షల ఎకరాల్లో లక్ష్యం
- లక్ష ఎకరాల్లో మాత్రమే నాట్లు
- మధ్య డెల్టాలో మరీ దారుణం

**సాక్షి, అమలాపురం: గోదావరి డెల్టాలో ఖరీఫ్ సాగు** మందకొడిగా సాగుతోంది. ఆగస్టు నెల వచ్చినా నాట్లు పడుతూనే ఉన్నాయి. మరోవైపు డెల్టా కాలువల ద్వారా సంవృద్ధిగా సాగునీరు విడుదల చేస్తున్నా జిల్లాలో ఖరీఫ్ నత్తను తలపిస్తోంది. మధ్య డెల్టాలో నాట్ల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. తొలకరి సాగుపై భరోసా లేకపోవడం వల్లే సాగు ఆలస్యమవుతోందని.. కొంతమంది సాగును వదిలేస్తున్నారని రైతులు చెబుతున్నారు.

గోదావరి డెల్టా కాలువలకు జూన్‌లో ఖరీఫ్ మొదలైన నాటి నుంచి ఇప్పటి వరకూ సుమారు 52.536 టీఎంసీల నీరు విడుదల చేసినట్టు జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు. ఇందులో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి తూర్పు డెల్టాకు 17.587 టీఎంసీలు, మధ్య డెల్టాకు 9.522 టీఎంసీలు, పశ్చిమ డెల్టాకు 25.42 టీఎంసీల నీటిని విడుదల చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో తూర్పు, మధ్య డెల్టాలకు కలిపి 27.109 టీఎంసీలు వదిలారు. ఖరీఫ్ షెడ్యూల్ ప్రకారం తూర్పు, మధ్య డెల్టాల్లో నాట్లు పూర్తి కావాల్సి ఉంది. **కోనసీమ జిల్లాలో మొత్తం 1,63,399 ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగు లక్ష్యం కాగా శుక్రవారం వరకూ 1,19,766 ఎకరాల్లో మాత్రమే నాట్లు పడ్డాయి. ఇందులో వెదజల్లు 17,884 ఎకరాలు కాగా, నాట్లు 1,01,882 ఎకరాల్లో వేశారు.** ఇంకా 43,633 ఎకరాల్లో నాట్లు పడాల్సి ఉంది. తూర్పు డెల్టాతో పోల్చుకుంటే మధ్య డెల్టాలో సగం కూడా నాట్లు పూర్తి కాలేదు. కోనసీమ జిల్లా తూర్పు డెల్టా పరిధిలో కొత్తపేట నియోజకవర్గంలో ఆలమూరు, మండపేట నియోజకవర్గంలో మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, రామచంద్రపురం నియోజకవర్గంలో రామచంద్రపురం, కె.గంగవరం మండలాల్లో సాగు వేగంగా సాగుతోంది.

**ఎందుకింత ఆలస్యం అంటే..**

మధ్య డెల్టాలోని శివారు ప్రాంతాల్లో తొలకరి పంట సాగు రైతులకు జూదంగా మారింది. మురుగునీటి పారుదల వ్యవస్థ అధ్వానంగా మారడంతో కొద్దిపాటి వర్షానికి ఇక్కడ చేలు ముంపు బారిన పడుతున్నాయి. ప్రస్తుతం జిల్లాలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. సగటు కన్నా 29 శాతం లోటు వర్షం ఉంది. అయితే అడపాదడపా పడిన వర్షాలకు చేలల్లో వర్షం నీరు చేరి సాగు చేయలేని పరిస్థితి ఉంటుంది. ఇక అక్టోబర్, నవంబర్లలో తుపాన్లు, **వాయుగుండం ప్రభావంతో భారీ వర్షాలు పడితే రైతులు సాగుపై పూర్తి ఆశలు వదులుకోవాల్సి వస్తుంది. వంట చేతికి వచ్చే సమయంలో నష్టపోతే ఎకరాకు రైతులు నగటున రూ. 25 వేల వరకూ పెట్టుబడిని కోల్పోతున్నారు. దీనికి తోడు ఈ ఏడాది పంట కాలువలకు సాగునీరు ఆలస్యంగా** వదలడం వల్ల కూడా రైతులు సకాలంలో సాగు చేపట్టలేకపోయారు. ఈ కారణాలతో డెల్టాలో సాగు మందకొడిగా జరుగుతోంది.

**నీరు విడుదల చేసినా..**

**మధ్య డెల్టాకు ఇంత వరకూ 9.522 టీఎంసీల నీరు విడుదల చేశారు. ఒక టీఎంసీతో 10,860 ఎకరాల సాగు చేయవచ్చు. అంటే ఇప్పటి వరకూ విడుదల చేసిన నీటితో 1.08 లక్షల** ఎకరాలను పూర్తిగా పండించవచ్చు. అయితే కేవలం 25,281 ఎకరాల్లో మాత్రమే నాట్లు పూర్తి కావడం గమనార్హం.

**నత్తనడకన సాగుతూ..**

మధ్య డెల్టా పరిధిలో శివారు ప్రాంతాల్లో సాగు మరీ నత్తనడకన సాగుతోంది. ఇక్కడ 16 మండలాల పరిధిలో మొత్తం ఆయకట్టు 71,966 ఎకరాలు కాగా, ఇప్పటి వరకూ 25,281 ఎకరాల్లో మాత్రమే నాట్లు పూర్తయ్యాయి. రాజోలు దీవిలో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. సఖినేటిపల్లిలో ఖరీఫ్‌లో వరి సాగు లక్ష్యం కేవలం 335 ఎకరాలు కాగా, ఇక్కడ కేవలం ఆరు ఎకరాల్లోనే నాట్లు వేశారు. మలికిపురం మండలంలో 793 ఎకరాలకు 120, రాజోలులో 3,548 ఎకరాలకు 398, మామిడికుదురులో 2,575 ఎకరాలకు 610 ఎకరాల్లో మాత్రమే నాట్లు వేశారు. మొత్తం 7,251 ఎకరాలకు సంబంధించి ఇంత వరకూ కేవలం 1,137 ఎకరాల్లో మాత్రమే నాట్లు పడ్డాయి. అమలాపురం నియోజకవర్గం ఉప్పలగుప్తం మండలంలో 4,795 ఎకరాలకు కేవలం 635 ఎకరాలు, అల్లవరం మండలంలో 2,875 ఎకరాలకు 190, అమలాపురం మండలంలో 4,872 ఎకరాలకు 1,465, ముమ్మిడివరం మండలంలో 5,293 ఎకరాలకు 1,165 ఎకరాల్లో మాత్రమే నాట్లు పడ్డాయి. ఈ మండలాల్లో సాగు మరీ ఘోరంగా ఉంది. నారుమడులు సైతం ఇంకా వేస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

## బోధనేతర పనులు అప్పగించొద్దు

### ఎమ్మెల్సీ గోపిరాజు, ఫ్యాప్టో రాష్ట్ర చైర్మన్ సాయి శ్రీనివాస్

అమలాపురం టౌన్: ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించొద్దని, రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన పలు బకాయిలను తక్షణమే చెల్లించాలని, పీ–4 కార్యక్రమాల్లో ఉపాధ్యాయులను నిర్బంధించవద్దని ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ బొర్రా గోపిరాజు, ఫ్యాప్టో రాష్ట్ర చైర్మన్ లంకలపల్లి సాయిశ్రీనివాస్ డిమాండ్ చేశారు. పలు డిమాండ్ల సాధన కోసం అమలాపురం నల్లవంతెన కూడలిలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన ధర్నాలో వారు మాట్లాడారు. ఉదయం ధర్నా చేసిన ఉపాధ్యాయులు మధ్యాహ్నం స్థానిక కలెక్టరేట్‌కు ప్రదర్శనగా వెళ్లి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్ ఏఓ కె.విశ్వేశ్వరరావుకు అందించారు. 19 డిమాండ్లపై ధర్నాలో వక్తలు చర్చించారు. ఉపాధ్యాయులు తరగతి గదుల్లో కేవలం బోధన బాధ్యతలు చేపడితే విద్యా ప్రమాణాలతో పాటు మెరుగైన ఉత్తీర్ణత సాధించవచ్చని వక్తలు అన్నారు. 12వ వేతన సవరణ సంఘాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని, 30 శాతం మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని నినాదాలు చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ప్రతి ఆరు నెలలకోసారి డీఏ ప్రకటించాలన్నారు. ఈ ధర్నాకు సీపీఐ, సీపీఎం, పలు ప్రజా సంఘాలు సంఘీభావం తెలిపాయి. ప్రభుత్వ పెన్షనర్లు కూడా ఈ నిరసనలో పాల్గొన్నారు. జిల్లా ఫ్యాప్టో చైర్మన్ ఎం టీవీ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి పోతంశెట్టి దొరబాబు ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో ఫ్యాప్టో ఆర్థిక కార్యదర్శి కె.రామచంద్రం, డిప్యూటీ సెక్రటరీ సరిదే సత్య పల్లంరాజు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పి.వెంకటేశ్వరరావు, ఎస్ఎస్ మునేశ్వరరావు, జీవీవీ సత్యనారాయణ, అబ్దుల్ రహీమ్, ఏఐటీయూసీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కె.సత్తిబాబు, సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఏఓకు వినతి పత్రాన్ని అందిస్తున్న ఫ్యాప్టో ప్రతినిధులు

## వైకుంఠవాసా.. శ్రీవేంకటేశా..

- మార్మోగిన వాడపల్లి క్షేత్రం
- ఒక్క రోజే రూ.60.47 లక్షల ఆదాయం

కొత్తపేట: కోనసీమ తిరుపతిగా ప్రసిద్ధి చెందిన ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామివారి క్షేత్రానికి శ్రావణమాసం శనివారం సందర్భంగా భక్తులు పోటెత్తారు. వేకువ జాము నుంచే రద్దీ నెలకొంది. గౌతమీ గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. క్యూ లైన్లలో బారులు తీరి స్వామివారిని దర్శించుకున్నారు. ముడుపులు, మొక్కుబడులు చెల్లించారు. ఏడు శనివారాల వెంకన్న దర్శనం నోము ఆచరించే భక్తులు మాడ వీధుల్లో ఏడు ప్రదక్షిణలు చేశారు. వైకుంఠవాసా.. శ్రీవేంకటేశా.. గోవిందా.. గోవిందా నామస్మరణతో ముందుకు సాగారు. దేవదాయ – ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు పర్యవేక్షణలో తెల్లవారుజామున ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి ఆదిత్య అనంతశ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు, వేదపండితులు సుప్రభాత సేవతో ప్రారంభించి స్వామివారికి వివిధ సేవలు నిర్వహించారు. అభిషేకాలు, అర్చనల అనంతరం రంగురంగుల సుగంధ భరిత పుష్పాలతో స్వామివారిని కన్నుల పండువగా అలంకరించారు. దేవస్థానం నిర్వహించిన అన్న సమారాధనలో భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.



వాడపల్లి క్షేత్రంలో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

**ఎండ బారిన పడకుండా..**

ఎండ తీవ్రతతో భక్తులు ఇబ్బందులు పడకుండా ఈఓ చక్రధరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. క్యూలైన్లను పర్యవేక్షించి భక్తులకు మంచినీటి ప్యాకెట్లు అందజేశారు. స్నాన ఘట్టం, తలనీలాల విభాగానికి వెళ్లే భక్తుల కోసం టెంట్లు, మ్యాట్లు ఏర్పాటు చేశారు. మెడికల్ క్యాంపులను వైద్య సిబ్బంది నిర్వహించారు. ఈ ఒక్కరోజు సాయంత్రం 5 గంటల వరకూ విశిష్ట, ప్రత్యేక దర్శనాలు, వేదాశీర్వచనం, ఆన్‌లైన్, నిత్య, శాశ్వత అన్నదానం విరాళాలు, లడ్డూ విక్రయం తదితర రూపాల్లో దేవస్థానానికి రూ.60,46,652 ఆదాయం వచ్చిందని ఈఓ తెలిపారు. రావులపాలెం సీఐ సీహెచ్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఆత్రేయపురం ఎస్ఐ ఎస్.రాము శాంతిభద్రతలను పర్యవేక్షించారు. ఏపీఎస్ ఆర్టీసీ వివిధ ప్రాంతాల నుంచి వాడపల్లి ఆలయానికి బస్సు సర్వీసులను నడిపింది.

### అప్పనపల్లికి పోటెత్తిన భక్తులు



అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. స్వామివారి పాత గుడితో పాటు కొత్త గుడి కిటకిటలాడింది. పవిత్ర వైనతేయ గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు శ్రీదేవి, భూదేవి సమేతుడైన బాల బాలాజీ స్వామివారిని దర్శించుకుని తన్మయత్వం చెందారు. స్వామివారికి ముడుపులు, మొక్కుబడులు చెల్లించారు. ఆలయానికి వివిధ సేవల ద్వారా రూ.2,78,173 ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ వి.సత్యనారాయణ తెలిపారు. స్వామివారి నిత్య అన్నదానానికి రూ.77,978 విరాళాలుగా వచ్చాయన్నారు. స్వామి వారిని ఐదు వేల మంది భక్తులు దర్శించుకోగా, 2,800 మంది అన్న ప్రసాదం స్వీకరించారు. హైదరాబాద్‌కు చెందిన వేగిరాతు లక్ష్మీపవన్, నాగతులసి దంపతులు రూ.10,116, తాటిపాకకు చెందిన మొల్లేటి శ్రీనివాసరావు, శ్రీవరహలక్ష్మి దంపతులు రూ.10,116 అన్నదానం ట్రస్టుకు విరాళంగా అందించారు. వారికి అర్చకులు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

### సమన్వయంతో పుష్కర ఏర్పాట్లు

- విజయవాడ డీఆర్ఎం మోహిత్ సోనాకియా
- రాజమండ్రి, గోదావరి, కొవ్వూరు సెక్షన్ల తనిఖీ



పుష్కరాల ఏర్పాట్లపై రైల్వే అధికారులకు సూచనలిస్తున్న డీఆర్ఎం మోహిత్ సోనాకియా

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): గోదావరి నదికి 2027వ సంవత్సరంలో జరగనున్న పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని విజయవాడ రైల్వే డీఆర్ఎం మోహిత్ సోనాకియా శనివారం రాజమండ్రి–గోదావరి–కొవ్వూరు సెక్షన్లను సంబంధిత అధికారులతో కలసి తనిఖీలు చేశారు. పుష్కరాలకు సుమారు 40 లక్షలకు పైగా ప్రయాణికులు వస్తారనే అంచనాతో రాజహేంద్రవరం స్టేషన్‌లోని తూర్పు, పశ్చిమ ప్రవేశ ద్వారాలు, స్టేషన్ యార్డులు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను పరిశీలించారు. జరుగుతున్న స్టేషన్ అభివృద్ధి పనులను పరిశీలించి యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రవేశ ద్వారాలు, సర్క్యులేటింగ్ ప్రాంతాలు, ప్రజలకు అందించే సౌకర్యాలపై అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. అనంతరం డీఆర్ఎం మాట్లాడుతూ పుష్కర యాత్రికుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, రద్దీని నియంత్రించేందుకు ఆయా స్టేషన్లలో ప్రత్యేక కార్యాచరణ చేపట్టనున్నట్లు తెలిపారు. స్టేషన్‌లో అదనపు లిఫ్టులు, ఎస్కలేటర్లు, టికెట్ బుకింగ్ పాయింట్‌లు, పార్కింగ్ స్థలాల ఆధునికీకరణ, సెల్‌ఫోన్ చార్జింగ్ పాయింట్‌లు, సిట్టింగ్ ప్రదేశాలు, షెల్టర్లు, ప్రయాణికులకు మౌలిక సదుపాయాలతో అప్‌గ్రేడ్ చేయనున్నట్లు తెలిపారు. ఈ పనులను సకాలంలో పూర్తిచేసేందుకు అధికారులు సమన్వయంతో కృషిచేయాలని వివరించారు. కార్యక్రమంలో పలు విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## లండన్‌లో పూర్ణిమ దీప్తులు

- నాటి కొత్తపేట వనితకు బ్రిటన్ అత్యున్నత పురస్కారం
- అక్కడి రాజవంశంచే ప్రదానం

కొత్తపేట: దేశం కాని దేశం, అందులోనూ అత్యున్నత పురస్కారం పొందడమంటే మామూలు విషయం కాదు.. ఎంతో సేవ చేసి, అందరితో శభాష్ అనిపించుకోవాలి.. అచ్చం అలానే సేవల్లో గుర్తింపు తెచ్చుకుని లండన్‌లో బ్రిటన్ రాజవంశం ఇచ్చే పౌర పురస్కారం తీసుకుని కోనసీమ జిల్లా ఆడపడుచు కీర్తి పతాకాన్ని ఎగురవేశారు. బ్రిటన్ రాజవంశం ఇచ్చే పౌర పురస్కారాల్లో అత్యున్నతమైన కమాండర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది బ్రిటిష్ అంపైర్ (సీబీఈ)ను కొత్తపేట ఆడపడుచు అయ్యగారి అన్నపూర్ణ (పూర్ణిమ తణుకు) దక్కించుకున్నారు. ప్రస్తుతం లండన్‌లో ఐదేళ్ల లోపు పిల్లల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న నేషనల్ డే నర్సరీస్ అసోసియేషన్‌కు పూర్ణిమ ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్‌గా ఉన్నారు. విభిన్న రంగాల్లో నిస్వార్థంగా సేవ చేస్తూ తమ జీవితాన్ని అంకితం చేసిన వారికి బ్రిటిష్ రాజవంశం ఇచ్చే పౌర పురస్కారాల్లో అత్యున్నత సీబీఈ లభిస్తుంది. అటువంటి పురస్కారం ఇటీవల పూర్ణిమకు దక్కింది.

**కొత్తపేట నుంచే బాట**

కొత్తపేటలో ప్రస్తుతం పొట్టిశ్రీరాములు వీధిని ఒకప్పుడు సత్యవోలు రామమూర్తి వీధి అని పిలిచేవారు. ఆ సత్యవోలు రామమూర్తి మనుమరాలు, కొత్తపేట మాజీ సర్పంచ్ సత్యవోలు రామకృష్ణ మేనకోడలు అయ్యగారి అన్నపూర్ణ (పూర్ణిమ). ఆమె తండ్రి విశ్వేశ్వరయ్య అమలాపురంలో టైప్ ఇనిస్టిట్యూట్ నడిపేవారు. తల్లి రత్నాంబ గృహిణిగా ఉండేవారు. అన్నపూర్ణ కొత్తపేటలో అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటూ చదువుకున్నారు. 1960 దశకంలో కొత్తపేట పంచాయతీ సమితి నంబరు– 1 ప్రాథమిక పాఠశాల (వీరయ్యగారి బడి)లో ప్రాథమిక విద్య, 1963–68 వరకూ చింతం అమ్మాణమ్మ జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఉన్నత విద్యను పూర్తి చేశారు. ఆ తర్వాత పీయూసీ, డిగ్రీ అమలాపురం ఎస్‌కేబీఆర్ కాలేజ్‌లో, పీజీ ఆంధ్రా యూనివర్సిటీలో చదివిన అయ్యగారి అన్నపూర్ణ అంచెలంచెలుగా ఎదిగి ఎన్నో ప్రతిభా పురస్కారాలను కైవసం చేసుకున్నారు. రిటైర్డ్ హెచ్ఎం, కొత్తపేట ప్రియదర్శినీ బాలవిహార్ వ్యవస్థాపకుడు, కవి, రచయిత, బహుముఖ ప్రజ్ఞాశాలి అద్దంకి కేశవరావు కుమార్తె స్వరాజ్యకుమారి వద్ద శాస్త్రీయ నృత్యం, గైడ్ స్టూడెంట్‌గా శిక్షణ పొందారు. లండన్‌లో సర్జన్ అయిన తణుకు వెంకట సూర్యనారాయణతో వివాహానంతరం 'పూర్ణిమ తణుకు'గా కొత్త జీవితాన్ని ఆరంభించారు.

**విశేష కృషికి గుర్తింపుగా..**

పూర్ణిమ తణుకు మూడేళ్ల నుంచి ఆరేళ్లలోపు పిల్లలకు అందించే విద్యలో చేసిన విశేష కృషికి ఈ గుర్తింపు లభించింది. ఇంత వరకూ బ్రిటన్‌లో స్థిరపడి పౌరసత్వం పొందిన తెలుగు వారెవరికీ దక్కని గౌరవమిది. వివిధ రంగాల్లో పనిచేస్తున్న వారి కృషిని భిన్నస్థాయిల్లో అత్యంత నిశితంగా పరిశీలించి ఈ పురస్కారాలకు ఎంపిక చేస్తారు. గత నెల 22న బ్రిటిష్ రాజవంశీకులుండే విండ్‌సార్ కేజిల్‌లో ఎంతో అట్టహాసంగా జరిగిన ఓ కార్యక్రమంలో క్వీన్ ఎలిజబెత్–2, ప్రిన్స్ ఫిలిప్‌ల కుమార్తె, ప్రస్తుత బ్రిటన్‌రాజు చార్లెస్ ఏకైక సోదరి అయిన ప్రిన్సెస్ ఆనీ ఈ పురస్కారాన్ని పూర్ణిమకు అందజేశారు.

**హేమాహేమీల పక్కన..**

ఖగోళ శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్, బ్రిటన్ ఆధునిక నాటక రచయిత, దర్శకుడు, నోబెల్ బహుమతి గ్రహీత అయిన హెరాల్డ్ పింటర్, రగ్బీ ఆటగాడు జొనాథన్ పీటర్ విల్కిన్సన్ వంటి హేమాహేమీలు గతంలో ఈ పురస్కారం అందుకున్న ప్రముఖుల్లో కొందరు. ఇటీవలే ప్రపంచ ప్రఖ్యాత ఫ్యాషన్ సంస్థ 'షెనెల్'కు సీఈఓగా ఉంటున్న లీనా నాయర్ కూడా సీబీఈ పురస్కారం అందుకున్నారు. తాజాగా పూర్ణిమ అందుకుని ఆ ప్రముఖుల సరసన నిలిచారు. ఈ పురస్కారాన్ని పొందటంలో తన కుటుంబం ఎంతో తోడ్పడిందని, అలాగే మిత్రులు, తన బృంద సభ్యుల కృషి కూడా ఉందని పూర్ణిమ తెలిపారు. వారందరికీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కొత్తపేట ఆడపడుచు, అక్కడ పూర్వ విద్యార్థిని అయిన పూర్ణిమకు బ్రిటన్ అత్యున్నత పురస్కారం పొందడం పట్ల ఈ గ్రామస్తులు, పూర్వ విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.



కొత్తపేట జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో 1968లో టీచర్లు, సహచర విద్యార్థినులతో పూర్ణిమ (కింది వరుసలో కుడి వైపు నుంచి మొదటి విద్యార్థిని)



లండన్‌లో ప్రిన్సెస్ ఆనీ చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న పూర్ణిమ



లండన్‌లో కుటుంబ సభ్యులతో పూర్ణిమ

## క్లుప్తంగా

### దళిత సర్పంచ్‌ను అవమానించారంటూ ఫిర్యాదు


డీఎల్‌పీఓ బొజ్జిరాజుకు ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్ అరుణ, ఎంపీటీసీ సభ్యులు

అమలాపురం రూరల్: పేరూరులో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి తనను ఆహ్వానించలేదని ఆ గ్రామ సర్పంచ్ దాసరి అరుణాడేవిడ్ ఆవేదన వ్యక్తం చేశారు. దళిత మహిళా సర్పంచ్ కావడంతోనే స్థానిక నాయకులు తనకు సమాచారం ఇవ్వలేదని, ప్రోటోకాల్‌కు విరుద్ధంగా సర్పంచ్ లేకుండా ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పింఛన్లు పంపిణీ చేయడం దారుణమని ఆమె శనివారం డీఎల్‌పీఓ బొజ్జిరాజుకు ఫిర్యాదు చేశారు. ఉప సర్పంచ్ కుడుపూడి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులు చొల్లంగి సుబ్బిరామ్, వాసంశెట్టి శ్రీనివాసరావు, దొంగ ఆంజనేయులు, వార్డు సభ్యుడు అప్పారి లక్ష్మీనారాయణ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు దాసరి నాగేశ్వరరావు తదితరులు డీఎల్‌పీఓకు వినతి పత్రం అందించారు. ప్రభుత్వ కార్యక్రమంలో సర్పంచ్ లేకుండా ప్రోటోకాల్‌కు విరుద్ధంగా ఎమ్మెల్యే పింఛన్లు పంపిణీ చేయడం సరికాదన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేస్తామని వారు అన్నారు.

# మిత్రోత్సాహం..

- సోషల్ మీడియా వేదికగా బలపడుతున్న స్నేహం
- మనసుకు ఓదార్పునిస్తున్న బంధం
- నేడు అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం

రాయవరం: స్నేహం.. సృష్టిలో మధురమైంది.. జీవితంలో మరువలేనిది.. ఆత్మీయతను పంచేది.. ఆహ్లాదాన్ని అందించేది.. అక్షరాలకతీతమైన పుస్తకం లాంటిది.. భారమైన హృదయానికి ఓదార్పునిస్తుంది.. కష్టాల్లో ఆసరా అవుతోంది. ఇలా స్నేహం గురించి ఎంత చెప్పినా తక్కువే. అందుకే స్నేహమేరా జీవితం ..స్నేహమేరా శాశ్వతమని అంటుంటారు. ఆదివారం అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవాన్ని జరుపుకొనేందుకు మిత్రులంతా సిద్ధమవుతున్నారు. సెల్‌ఫోన్ వినియోగం మనుషుల మధ్య సంబంధాలను మరింత దగ్గర చేసింది. వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి సామాజిక మాధ్యమాలు అందుబాటులోకి వచ్చిన తర్వాత సరికొత్త స్నేహాలు చిగురిస్తున్నాయి. సోషల్ మీడియా సమాచార వ్యాప్తిలో ప్రధాన భాగస్వామిగా నిలుస్తుంది. ఒకప్పుడు ఉత్తరాలు, తదుపరి ఫోన్‌లో మాట్లాడుకునే స్థాయి నుంచి సోషల్ మీడియా సాయంతో దేశ, విదేశాల్లో ఉంటున్న వారు సైతం వీడియో కాల్స్ ద్వారా సంభాషణలు సాగిస్తున్నారు. నిత్య జీవితంలో ఎదురయ్యే అనుభవాలు, మార్పులు చేర్పులను ఎప్పటికప్పుడు షేర్ చేసుకుంటున్నారు. ముఖ్యంగా వాట్సాప్ గ్రూపులతో సామాజిక సంబంధాల్లో ఊహించని మార్పు వచ్చింది. 90 శాతం మంది మొబైల్ ఫోన్లలో మై ఫ్యామిలీ, టెన్త్ క్లాస్, ఇంటర్, డిగ్రీ పేర్లతో తప్పనిసరిగా వాట్సాప్ గ్రూపులు ఉంటున్నాయి. ఈ గ్రూపుల ద్వారా చిన్ననాటి స్నేహితుల నుంచి ఆఫీసులో కొలీగ్స్ వరకూ అందరూ నిత్యం టచ్‌లో ఉంటున్నారు. స్నేహితుల దైనందిన జీవితంలో జరిగే మంచి చెడులను ఎప్పటికప్పుడు పంచుకోవడమే కాదు, శుభాకాంక్షలూ చెప్పుకొంటున్నారు.



రాయవరం పాఠశాలలో విద్యార్థినికి ప్రోత్సాహకం అందిస్తున్న 2016 బ్యాచ్ పూర్వ విద్యార్థులు (ఫైల్)

**జాగ్రత్తలూ అవసరమే..**
సోషల్ మీడియా ఆసరాగా చేసుకుని కొందరు ఫేక్ ఫ్రెండ్‌షిప్‌లు చేస్తున్నారు. అటువంటి వారి విషయంలో జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది. వాట్సాప్, ఇన్‌స్టాగామ్, ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా ఫ్రెండ్ రిక్వెస్ట్ పెడుతున్నారు. అపరిచితులు పరిచయాలను పెంచుకుంటున్నారు. పరిచయాన్ని స్నేహంగా మలచుకుంటున్నారు. ఆపై స్నేహాన్ని అడ్డుపెట్టుకుని బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడడం వంటి ఘటనలు చూస్తున్నాం. సోషల్ మీడియా ఫ్రెండ్‌షిప్ పట్ల యువత, ముఖ్యంగా బాలికలు, మహిళలు మరింత జాగ్రత్తగా ఉండాలి. ఆన్‌లైన్ ఫ్రెండ్‌షిప్ మొదటికే మోసం తెస్తుండడంతో అపరిచితులతో ఆచితూచి స్నేహం చేయాల్సిన అవసరం కూడా ప్రస్తుత కాలంలో ఉంది. ఇదిలాఉంటే మార్కెట్‌లో ఫ్రెండ్‌షిప్ బ్యాండ్ల అమ్మకాలు విరివిగా జరుగుతున్నాయి.

**రెండు దశాబ్దాల నుంచి..**
రాయవరంలో 2002లో తొలిసారి 1981–82 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు కలిశారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనే తొలిసారిగా రాయవరంలో కలిసినట్లు చెబుతుంటారు. ఈ విషయం ఆ నోటా ఈ నోటా ప్రచారం కావడంతో ఇతర ప్రాంతాల్లోని విద్యార్థులు కూడా పూర్వ విద్యార్థుల సమ్మేళనాలకు నాంది పలికినట్లైంది. అప్పుడు ప్రారంభమైన పూర్వ విద్యార్థుల కలయిక దినదినప్రవర్ధమానమైంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలల్లో చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఏటా సంక్రాంతి సమయాల్లో లేదా, వేసవి సెలవుల్లో, వివిధ సందర్భాల్లో కలుసుకుంటున్నారు.




అమ్మకానికి సిద్ధమైన ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు

**ఇది కదా స్నేహమంటే..**
రాయవరం శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1989–94 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు 2016 జనవరిలో కలిశారు. తమ బ్యాచ్‌కు చెందిన నలుగురు స్నేహితుల ఆరోగ్య పరిస్థితులు, కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో అంతా కలసి ఆర్థిక సాయం అందించారు. నలుగురు విద్యార్థులకు రూ.5.25 లక్షలు అందజేశారు. అలాగే 2016 నుంచి ఏటా రాయవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆగస్టు 15న పూర్వ విద్యార్థులంతా కలుసుకుని, పాఠశాలలో మెరిట్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్నారు. ఈ విధంగా ఇప్పటి వరకూ రూ.6.50 లక్షలు విద్యార్థులకు అందజేశారు. స్నేహమంటే కలుసుకుని కబుర్లు చెప్పుకోవడం కాదని, మిత్రులకు, సమాజానికి మంచి చేయాలని నిరూపిస్తున్నారు. ఇలా జిల్లా వ్యాప్తంగా చాలామంది స్నేహహస్తాన్ని అందిస్తున్నారు.

**ప్రతి సమాచారం వాట్సాప్‌లోనే..**
పూర్వ విద్యార్థులు పలు వాట్సాప్ గ్రూపులు క్రియేట్ చేస్తున్నారు. ఈ గ్రూపుల్లో నిత్యం స్నేహితుల యోగక్షేమాలతో పాటు, గ్రామంలో జరుగుతున్న కార్యకలాపాలను కూడా షేర్ చేసుకుంటున్నారు. స్నేహితుల కష్టసుఖాలను తెలుసుకుంటూ అవసరమైన మేరకు మిగిలిన వారిని ఆదుకుంటున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో వాట్సాప్ గ్రూపులు ఉన్నాయంటే ఆశ్చర్యపోనవసరం లేదు.

### బదిలీ ఉపాధ్యాయులకు జీతాలు ఇవ్వండి

ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ డిమాండ్



అమలాపురం టౌన్: రాష్ట్రంలో ఇటీవల బదిలీ అయిన 60 వేల మంది ఉపాధ్యాయులకు రెండు నెలల జీతాలు తక్షణమే చెల్లించాలని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అమలాపురంలో శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. గత జూన్ నెలలో సాధారణ బదిలీల్లో భాగంగా దాదాపు 67 వేల మంది ఉపాధ్యాయులకు స్థాన చలనం జరిగిందన్నారు. కొందరు స్కూల్ అసిస్టెంట్లను మోడల్ ప్రైమరీ స్కూళ్ల హెచ్‌ఎంలుగా, మరికొందరు ఎస్జీటీలకు పదోన్నతులు ఇచ్చి హెచ్‌ఎంలుగా పంపించిందని గుర్తు చేశారు. స్కూల్ అసిస్టెంట్ సమాన క్యాడర్ బదిలీలు జూన్ 9తో, ఎస్జీటీల బదిలీలు జూన్ 14తో ముగిశాయన్నారు. మరుసటి రోజు అందరూ బదిలీల ప్రకారం కొత్త పాఠశాలలకు వెళ్లి బాధ్యతలు చేపట్టారని వివరించారు. కొందరు ఉన్న క్యాడర్లలోనే స్థానికంగా మారడంతో వారికి వేతనాలు అందాయన్నారు. కానీ పోస్టుతో సహా స్థానచలనం కలిగిన దాదాపు 60 వేల మంది ఉపాధ్యాయులకు జూన్, జూలై నెలలకు జీతాలు జమ కాలేదని తెలిపారు. తక్షణమే ప్రభుత్వం రెండు నెలల జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో వైఎస్సార్ సీపీ తరఫున ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని ప్రభుత్వాన్ని ఆయన హెచ్చరించారు.

### గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్


కాత్రావులపల్లిలో లోవరాజును అరెస్టు చేసిన జగ్గంపేట ఎస్సై రఘునాథరావు

జగ్గంపేట: కాత్రావులపల్లిలో పోలీసుల తనిఖీల్లో గంజాయితో ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు జగ్గంపేట ఎస్సై రఘునాథరావు తన సిబ్బందితో శనివారం కాత్రావులపల్లి పెట్రోల్ బంక్ సమీపంలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో కాత్రావులపల్లికి చెందిన కె.లోవరాజు అనే రాజేష్ ఎలియాస్ పటేల్ (37)ను అనుమానంతో అరెస్టు చేశారు. అతని వద్ద 4.38 కిలోల గంజాయి లభ్యమైంది. లోవరాజును పెద్దాపురం కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించిందని సీఐ తెలిపారు.

### అంబాజీపేట కొబ్బరి మార్కెట్



| కొబ్బరి రకం | ధర (రూ.ల్లో) |
|---|---|
| కొత్తకొబ్బరి (క్వింటాల్) | 23,000 – 23,500 |
| కొత్తకొబ్బరి (రెండవ రకం) | 10,500 – 12,000 |
| **కురిడీ కొబ్బరి (పాతవి)** | |
| గండేరా (వెయ్యి) | 30,000 |
| గటగట (వెయ్యి) | 27,000 |
| **కురిడీ కొబ్బరి (కొత్తవి)** | |
| గండేరా (వెయ్యి) | 29,000 |
| గటగట (వెయ్యి) | 26,000 |
| నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి) | 18,000 – 19,000 |
| కొత్త (పచ్చి)కాయ (వెయ్యి) | 18,000 – 19,000 |
| కొబ్బరి నూనె (15 కిలోలు) | 6,000 |
| ఒక కిలో | 400 |

# అగ్గి... సర్వం బుగ్గి

- చినశంకర్లపూడిలో అగ్ని ప్రమాదం
- ఆరు తాటాకిళ్లు భస్మీపటలం

ప్రత్తిపాడు: ఊరంతా నిశ్శబ్దం.. అందరూ నిద్రలోకి జారుకున్నారు.. ఇంతలో ఒక్కంతా వేడి సెగలు.. తుల్లిపడిన ఆ కుటుంబాలు ఒక్కసారిగా బయటకు పరుగులు తీశాయి.. తేరుకునేలోపే ఆరు తాటాకిళ్లు కాలిపోయాయి. సర్వం బుగ్గి అయ్యింది. ఆ పేద కుటుంబాలు కట్టుబట్టలతో మిగిలాయి. ప్రత్తిపాడు మండలం చినశంకర్లపూడిలో శనివారం తెల్లవారుజామున జరిగిన అగ్ని ప్రమాదం ఆరు కుటుంబాలను నిరాశ్రయులను చేసింది. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ముంచుకొచ్చిన ముప్పు ఇళ్లను బూడిద చేసింది. చినశంకర్లపూడి హరిజన కాలనీలో బుర్రి మరిడమ్మ, మానూరి రాజబాబు, ముతకల నాగేశ్వరరావు, పిరాటి అచ్చారావు, పిరాటి అప్పారావు, పులగపూరి సత్యనారాయణ కుటుంబాలు తాటాకిళ్లలో జీవిస్తున్నారు. వీరంతా వ్యవసాయ కూలీలే.

**ఒక్కసారిగా అగ్నికీలలు**
ఊరంతా గాఢ నిద్రలో ఉండగా శనివారం తెల్లవారుజామున సుమారు మూడు గంటల సమయంలో బుర్రి మరిడమ్మ తాటాకింటికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు అంటుకున్నాయి. తేరుకునేలోగా మంటలు ఒక్కొక్క ఇంటికి వ్యాపించాయి. ఇళ్లలోని వారంతా బయటకు పరుగులు తీశారు. ఒక ఇంటి నుంచి ఇంకొక ఇంటికి చొప్పున మానూరి రాజబాబు, ముతకల నాగేశ్వరరావు, పిరాటి అచ్చారావు, పిరాటి అప్పారావు, పులగపూరి సత్యనారాయణ ఇళ్లకు మంటలు వ్యాపించాయి. బుర్రి మరిడమ్మ, మానూరి రాజబాబు, పిరాటి అచ్చారావు ఇళ్లలో వేడిమికి గ్యాస్ సిలెండర్లు పేలిపోవడంతో మంటలు క్షణాల్లోనే ఆరు తాటాకిళ్లను భస్మీపటలం చేశాయి. ప్రమాదవార్త తెలిసిన వెంటనే ప్రత్తిపాడు అగ్నిమాపక కేంద్రం ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ కె.రాముడు, లీడింగ్ ఫైర్‌మెన్ కేఎస్‌ఎన్ మూర్తి తమ సిబ్బందితో సకాలంలో సంఘటనా స్థలానికి చేరుకుని, మంటలను అదుపులోకి తెచ్చారు. కాగా సుమారు రూ.ఎనిమిది లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్టు ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ రాముడు తెలిపారు.

**బాధితులంతా నిరుపేదలే..**
ఒంటరి మహిళ బుర్రి మరిడమ్మ ఒక ఇంట్లో ఉంటుండగా, చదువుకుంటున్న ముగ్గురు పిల్లలు, భార్యతో కలసి మానూరి రాజబాబు ఒక ఇంట్లో, భార్య నాగమణితో కలసి ముతకల నాగేశ్వరరావు, భార్యతో కలసి పిరాటి అచ్చారావు, భార్య కుమారుడితో కలసి పిరాటి అప్పారావు, ఒంటరిగా పులగపూరి సత్యనారాయణలు మరో ఇంట్లో జీవిస్తున్నారు. అగ్ని ప్రమాదంలో ఇంట్లో సమస్తం కాలి బూడిద కావడంతో బాధితులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ప్రమాద స్థలాన్ని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సందర్శించారు. ఒక్కో కుటుంబానికి 25 కిలోల బియ్యం, నిత్యావసర వస్తువులు, దుప్పట్లు, వంట సామగ్రి పంపిణీ చేశారు.


చినశంకర్లపూడిలో అగ్నికి ఆహుతవుతున్న ఇళ్లు


కట్టుబట్టలతో మిగిలిన బాధితులు



# చెప్పుల దుకాణంలో అగ్ని ప్రమాదం


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది



శ్యామలా సెంటర్ వద్ద చెప్పుల దుకాణంలో పొగలు

**రూ.16 లక్షల ఆస్తి నష్టం**

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక శ్యామలా సెంటర్ వద్ద చెప్పుల దుకాణంలో శనివారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. స్టేడియం రోడ్డు నుంచి కోటిపల్లి బస్టాండ్‌కు మలుపు తిరిగే ప్రాంతంలో ఆనుకుని ఫ్యాక్టరీ ఫుట్‌వేర్ సేల్ అనే పేరుతో హైదరాబాద్‌కు చెందిన షేక్ మొహియుద్దీన్, ఆర్‌ఎస్ దత్తు ఈ చెప్పుల దుకాణం నిర్వహిస్తున్నారు. ఉదయం 6.40 గంటలకు ఆ దుకాణంలోంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వెంటనే స్థానికులు అగ్నిమాపక కార్యాలయానికి ఫోన్ చేశారు. ప్రమాదానికి దగ్గరలోనే అగ్నిమాపక కార్యాలయం ఉండడంతో వెంటనే ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్, సిబ్బంది ఆ ప్రాంతానికి చేరుకున్నారు. నగరంలోని ఆర్యాపురం, ఇన్నీసుపేట అగ్నిమాపక యంత్రాలతో పాటు కొవ్వూరు నుంచి మరో వాహనాన్ని రప్పించి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో చెప్పుల దుకాణానికి ఆనుకుని ఉన్న బాలాజీ అక్వేరియం, పెట్స్ దుకాణం అగ్ని ప్రమాదానికి గురైంది. సుమారు రూ.16 లక్షల ఆస్తి నష్టం జరిగి ఉంటుందని ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్ అంచనా వేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగిందని తెలిపారు. జిల్లా విపత్తు స్పందన, అగ్నిమాపక అధికారి సీహెచ్ మార్టిన్‌రూథర్ కింగ్ సంఘటనా స్థలానికి వచ్చి పరిస్థితిని సమీక్షించారు. మంటలను చాకచక్యంగా అదుపు చేసిన అగ్నిమాపక సిబ్బందిని ఆయన అభినందించారు.

# ప్రవర్తన నియమావళిపై పట్టు సాధించాలి

సామర్లకోట: ప్రభుత్వ ఉద్యోగుల ప్రవర్తన నియమావళి (సీసీఏ)పై ఎంపీడీఓలు పట్టు సాధించాలని కొత్తపేట ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్ తెలిపారు. శనివారం స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో ఎంపీడీఓలకు ఇస్తున్న శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని శిక్షణ ఇచ్చారు. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో పదోన్నతి పొందిన ఎంపీడీఓలకు ఇక్కడ శిక్షణ ఇస్తున్నారు. ఆరో రోజు శిక్షణలో ఆయన పాల్గొని మాట్లాడుతూ విధి నిర్వహణలో నిర్లక్ష్యం, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులతో కుమ్మక్కు అయినట్లు రుజువైతే శిక్ష ఉంటుందన్నారు. కింది స్థాయి సిబ్బంది తప్పులు చేసిన సమయంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి వారిని సస్పెండ్ చేసే అధికారం ఉంటుందన్నారు.


ఎంపీడీఓల శిక్షణలో మాట్లాడుతున్న కొత్తపేట ఎంపీడీఓ నరేష్‌కుమార్

# అయస్కాంతాన్ని మింగేసిన బాలిక


బాలిక మింగేసిన అయస్కాంతం ముక్క


వైద్య సేవలు పొందుతున్న మాడెం రమ్య

**తొలగించిన వైద్యులు**

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని బురదకోట గ్రామ పంచాయతీ బాపన్నధార గిరిజన గ్రామానికి చెందిన మాడెం రమ్య ఓ తినుబండారం ప్యాకెట్‌లో ఉన్న అయస్కాంతం ముక్కను మింగేసింది. ఆ బాలికను కాకినాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి దానిని వైద్యులు తొలగించారు. మాడెం రమ్య బురదకోటలోని గిరిజన ప్రభుత్వ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతోంది. రింగ్ ప్యాకెట్లు తినే అలవాటు ఉన్న బాలిక ఆ ప్యాకెట్‌లోని తిను బండారాలతో పాటు అయస్కాంతం ముక్కను కూడా మింగేసింది. ఆమెను ప్రత్తిపాడు, ఏలేశ్వరంలోని ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించి వైద్య సేవలు అందించగా ఫలితం లేకపోవడంతో కాకినాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి అయస్కాంతం ముక్కను తొలగించారు. ఈ అంశంపై సంబంధిత రింగ్ కంపెనీపై న్యాయ పోరాటం చేస్తామని బాలిక తల్లిదండ్రులు తెలిపారు.